## నేడు రూ.7.91 లక్షల నగదు సీజ్

*జిల్లాలో ముమ్మరంగా తనిఖీలు*

సిటీబ్యూరో, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): శాసనసభ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాలో భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో ఫ్లయింగ్ స్క్వాడ్స్ తనిఖీలు చేస్తున్నాయి. భారీ స్థాయిలో నగదు, నగలు, మద్యం, ఇతర వస్తువులు పట్టుకుంటున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా గురువారం రూ.7,91,720 నగదును సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా ఇప్పటి వరకు రూ.1,07, 99, 970 నగదును సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. పోలీసు అథారిటీ ద్వారా రూ. 11, 58, 40, 600 సీజ్ చేయగా.. ఇప్పటి వరకు రూ.35,28,48,715 నగదు సీజ్ చేసినట్లు చెప్పారు. లా అండ్ ఆర్డర్ ద్వారా ఇప్పటి వరకు 4,164 లైసెన్స్ ఆయుధాలను సేకరించామన్నారు. సీఆర్‌పీఎఫ్ 333 కేసులు నమోదయ్యాయని తెలిపారు. 916 మంది బైండోవర్, నాన్ బెయిలబుల్ వారంట్ కింద 414 కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖ ద్వారా 221 లీటర్ల లిక్కర్‌ను సీజ్ చేసినట్టు వివరించారు.

## ర్యాగింగ్‌కు పాల్పడిన వైద్య విద్యార్థి.. ఏడాది సస్పెండ్



గాంధీ వైద్య కళాశాలలో జరిగిన యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

బన్సీలాల్‌పేట, అక్టోబర్ 19: గాంధీ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్‌కు పాల్పడిన ఓ వైద్య విద్యార్థిని ఏడాది పాటు సస్పెండ్ చేశామని డీఎంఈ, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేశ్ రెడ్డి తెలిపారు. కళాశాలలో గురువారం యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశమైంది. కళాశాలలోని అనాటమీ విభాగంలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్స్‌లో బాధితులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారని ప్రిన్సిపాల్ తెలిపారు. విచారణ అనంతరం ర్యాగింగ్‌కు పాల్పడిన 2020 బ్యాచ్‌కు చెందిన సీనియర్ విద్యార్థిగా నిర్ధారణ అయ్యిందని చెప్పారు. అందుకు శిక్షగా అతడిని ఏడాది పాటు తరగతులకు హాజరు కాకూడదని, హాస్టల్‌లో కూడా ఉండకూడదని సూచిస్తూ సస్పెండ్ చేస్తున్నట్టు యాంటీ ర్యాగింగ్ కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని తెలిపారు. కళాశాలలో ర్యాగింగ్‌ను నిరోధించడానికి సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఎన్ఎంసీ రూపొందించిన చట్టాలను అమలు చేయాలని తీర్మానించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో కష్టపడి చదివి, మెరిట్ సాధించి ఇక్కడ సీటు సంపాదించుకున్న పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించడానికి వస్తారన్నారు. వారితో స్నేహంగా ఉండి ఆదర్శంగా నిలవాలని సీనియర్లను కోరుతున్నామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు, గాంధీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.కృష్ణమోహన్, వివిధ విభాగాల హెచ్ఓడీలు, స్థానిక మీడియా ప్రతినిధి సీనియర్ జర్నలిస్టు కే.శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.

## ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీ.. చార్జింగ్ చేస్తుండగా పేలి ఇల్లు దగ్ధం

**రూ.5 లక్షల ఆస్తి నష్టం**



ఇంద్రానగర్‌లో ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీని చార్జింగ్ చేస్తుండగా పేలడంతో కాలిపోయిన ఇంట్లోని సామగ్రిని పరిశీలిస్తున్న పోలీసులు

మలక్‌పేట, అక్టోబర్ 19: ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీని చార్జింగ్ చేస్తుండగా మంటలు చెలరేగి ఇంట్లోని గృహోపకరణాలు కాలిపోయాయి. ఈ ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూసారాంబాగ్‌లో గురువారం తెల్లవారు జామున జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. ఇంద్రానగర్ కాలనీకి చెందిన మహేశ్ బుధవారం అర్ధరాత్రి వంటగదిలో తన ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీని చార్జింగ్ పెట్టాడు. రెండుగంటల తర్వాత (తెల్లవారు జామున మూడు గంటలకు) బ్యాటరీ పేలి మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో షాక్ సర్క్యూట్ జరిగి పెద్ద ఎత్తున మంటలు ఎగిశాయి. ఈ ప్రమాదంతో మేలుకున్న మహేశ్ వెంటనే కుటుంబ సభ్యులను బయటికు పంపించి.. 100 నంబర్‌కు సమాచారమిచ్చాడు. కంట్రోల్ రూం సిబ్బంది వెంటనే మలక్‌పేట పోలీసులను అప్రమత్తం చేయటంతో.. వారు అగ్నిమాపక కేంద్రానికి సమాచారమిచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని సామగ్రి, టీవీ, ఫ్రిజ్, బీరువా, తినుబండారాలు, దుస్తులు, సర్టిఫికెట్లు మొత్తం కాలి బూడిదయ్యాయని ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం లేదని, సుమారు రూ.5 లక్షల మేరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని ఆయన తెలిపారు. గ్యాస్ సిలిండర్ పేలకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని తెలిపారు.

# ప్రత్యేక చెక్‌పోస్టులు.. విస్తృతంగా తనిఖీలు

*మూడు కమిషనరేట్ల పరిధిలో*
*ఠాణాకు 2 నుంచి 4 బృందాలతో తనిఖీలు*



తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదును పరిశీలిస్తున్న సీపీ డీఎస్. చౌహాన్

సిటీబ్యూరో,అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): అక్రమ మద్యం, డబ్బు పంపిణీని అరికట్టేందుకు మూడు పోలీసు కమిషనరేట్ల పరిధిలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. రాజకీయ పార్టీలు ఓటర్లను మభ్యపెట్టే యత్నం చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రతి ఠాణా పరిధిలో రెండు నుంచి నాలుగు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. సంబంధిత పత్రాలు లేని నగదు, బంగారం, వెండితో పాటు ఓటర్లను ప్రభావితం చేసే ఇతర వస్తువులను సీజ్ చేస్తున్నారు. మూడు కమిషనరేట్ల పరిధిలో 24/7 చెక్‌పోస్టులను నిర్వహిస్తూ తనిఖీలు జరుపుతున్నారు. మహానగరంతో పాటు ఇతర జిల్లాల నుంచి నగరంలోకి ప్రవేశించే సరిహద్దుల వద్ద ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. తనిఖీలు పారదర్శకంగా ఉండే విధంగా ప్రతి తనిఖీని వీడియో రికార్డింగ్ చేస్తున్నట్లు తెలిపారు.

### నారాయణగూడలో రూ.11.25 లక్షలు..

స్కూటీపై వెళ్తున్న ఓ వ్యక్తిని నారాయణ గూడ పోలీసులు తనిఖీ చేయగా అతడి బ్యాగులో రూ.11.25 లక్షలు పట్టుబడ్డాయి. సరైన ఆధారాలు చూపకపోవడంతో నగదు సీజ్ చేశారు.

### దూలపల్లిలో భారీగా బంగారం..

మలబార్ గోల్డ్ సంస్థ నిర్వాహకులు బంగారం తరలిస్తుండగా దూలపల్లిలో పేట్ బషీరాబాద్ పోలీసుల తనిఖీల్లో పట్టుకున్నారు. 54 లక్షల విలువ చేసే 15 కేజీల బంగారం, 11 కేజీల వెండి, 120 గ్రాముల డైమండ్స్‌కు సంబంధించిన పత్రాలను పరిశీలించిన అధికారులు అనంతరం తిరిగి మలబార్ నిర్వాహకులకు అప్పగించారు.

### కొత్తపేటలో రూ. 97 లక్షలు..

కొత్తపేటలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న చైతన్యపురి పోలీసులకు ఒక వ్యక్తి రూ. 97,16,865 నగదుతో వెళ్తూ పట్టుబడ్డాడు. కద్రిక రాజేశ్ బ్రింక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో క్యాష్ కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. కొత్తపేటలోని ఓమిని దవాఖాన వద్ద తనిఖీలు చేస్తుండగా భారీ నగదుతో పట్టుబడ్డాడని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ తెలిపారు.

### శంషాబాద్‌లో రూ. 19.88 లక్షలు..

కాటేదాన్‌కు చెందిన బి. మహేందర్ కారులో రూ.19.88 లక్షలు తరలిస్తుండగా.. శంషాబాద్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద తనిఖీలు నిర్వహించిన శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

### ఘట్‌కేసర్‌లో చీరలు, నగదు..

ఘట్‌కేసర్ రూరల్: ఘట్‌కేసర్ పరిధిలోని కేపాల్ చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా.. నగరం నుంచి వరంగల్ వైపు వెళ్తున్న ఓ ట్రక్కులో సరైనా ఆధారాలు లేకుండా తరలిస్తున్న 615 చీరలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# ఒడిశా టూ ఓల్డ్ సిటీ.. గంజాయి స్మగ్లింగ్

*ముగ్గురు అరెస్టు..*
*రూ. 1.1 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం*

సిటీబ్యూరో, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): ఐరన్ బాక్స్‌లో గంజాయి దాచి.. ఒడిశా నుంచి హైదరాబాద్ పాత బస్తీకి స్మగ్లింగ్ చేస్తున్న ముఠాను మల్కాజిగిరి ఎస్ఓటీ, కీసర పోలీసులు పట్టుకున్నారు. ఈ వివరాలను గురువారం రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బీదర్‌కు చెందిన బహుల్య లీలావతి అలియాస్ గంగరాజు, గోపాల్ అలియాస్ మూల్ చంద్, సంతోష్, మోహన్ రాథోడ్ ఒక గ్యాంగుగా ఏర్పడ్డారు. వీరంతా ఒడిశా నుంచి హైదరాబాద్ పాత బస్తీకి గంజాయిని సరఫరా చేసేందుకు సిద్ధమయ్యారు. హైదరాబాద్‌లోని నాచారానికి చెందిన పెద్ద బాబూరావు, అతడి స్నేహితుడు మద్దెల రమేశ్‌తో గంగరాజు టీమ్ మాట్లాడింది. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి సరఫరా చేయాలని, ఇందుకు ఒక గూడ్స్ క్యారియర్‌ను తీసుకొని అందులోని ఐరన్ బాక్స్‌ల్లో గంజాయి ప్యాక్ చేసి రవాణా చేస్తే ఎవరికీ పట్టుబడమని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా మోహన్ రాథోడ్, పెద్ద బాబూరావు, మిద్దెల రమేశ్ కలిసి గూడ్స్ క్యారియర్ ఆటోలో ఒడిశా నుంచి హైదరాబాద్‌కు ప్రయాణమయ్యారు. వీరికి పైలెట్‌గా గోపాల్, సంతోష్ వస్తున్నారు. వీరు కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రాగానే.. మల్కాజిగిరి ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ రాములు, కీసర ఇన్‌స్పెక్టర్ వెంకయ్య బృందాలు విశ్వసనీయ సమాచారంతో అశోక్ లీలాండ్ దోస్త్ గూడ్స్ వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. ఇనుప బాక్స్‌లలో దాచిన గంజాయి డబ్బాలు బయటపడ్డాయి. మోహన్ రాథోడ్, బాబూరావు, మద్దెల రమేశ్‌ను అరెస్టు చేశారు. పైలెట్‌గా వస్తున్న వారు పోలీసులను చేసి పరారయ్యారు. ఈ ముఠా నుంచి 430 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ. 1.1 కోట్లు ఉంటుందని సీపీ చెప్పారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి డీసీపీ జానకీ, ఎస్ఓటీ డీసీపీ గిరిధర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

### ఓఆర్ఆర్ వద్ద..

ఏపీ నుంచి ఢిల్లీ వయా హైదరాబాద్ మీదుగా గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ముఠాను హయత్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. ఈ వివరాలను రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ గురువారం మీడియాకు వివరించారు. విశాఖపట్టణం జిల్లాకు చెందిన నూకరాజు, అక్కబాతుల లక్ష్మణ్ కుమార్, గంట శ్రీను బాబు కలిసి ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి మహారాష్ట్ర, ఢిల్లీకి గంజాయి సరఫరా చేస్తున్నారు. నూకరాజు వద్ద ఉన్న ట్యాంకర్ లారీని గంజాయి రవాణాకు ఉపయోగిస్తున్నారు. ఒక్కో ట్రిప్పుకు ఇద్దరికీ లక్ష రూపాయలు ఇస్తారు. ఈ నెల 18వ తేదీన నూకరాజు ఇద్దరిని పిలిచి పోలవరంలో గంజాయిని లారీలో నింపి, దానిని ఢిల్లీలో అప్పగించాలని సూచించాడు. దీంతో లక్ష్మణ్, శ్రీను కలిసి లారీ తీసుకొని ఢిల్లీకి ఖమ్మం, సూర్యపేట, హైదరాబాద్ మీదుగా వెళ్లేందుకు బయలుదేరారు. ఈ క్రమంలోనే పెద్దంబర్‌పేట ఓఆర్ఆర్ వద్దకు రాగానే విశ్వసనీయ సమాచారంతో హయత్‌నగర్ పోలీసులు లారీని ఆపి తనిఖీలు చేశారు. అందులో 200 కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయితో పాటు లారీని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి, సూత్రధారి నూకరాజు కోసం గాలిస్తున్నారు. గంజాయి విలువ రూ. 60.10 లక్షలు ఉంటుందని సీపీ తెలిపారు. ఈ సమావేశంలో ఎల్బీనగర్ డీసీపీ సాయి శ్రీ, వనస్థలిపురం ఏసీపీ భీమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నానక్‌రాంగూడలో..

అక్రమంగా గంజాయి, చరాస్ ప్యాకెట్లను విక్రయిస్తున్న ఇద్దరిని శంషాబాద్ డీటీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఎక్సైజ్, ప్రొహిబిషన్ శంషాబాద్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి సిబ్బందితో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించి వివరాలను వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన నిలేష్ ఇండోరియా (28), మనీష్ (20) బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వలస వచ్చారు. డబ్బులు సంపాదించాలనే ఆశతో పలు రాష్ట్రాల నుంచి గంజాయి, చరాస్‌ను తీసుకువచ్చి ఐటీ ఉద్యోగులకు విక్రయించడం మొదలుపెట్టారు. ఈ నెల 19వ తేదీన నానక్‌రాం గూడలోని విప్రో జంక్షన్ వద్ద ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి చరాస్, గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మొత్తం సొత్తు విలువ రూ. 8.5 లక్షలు ఉంటుందని చెప్పారు. సమావేశంలో శంషాబాద్ డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## జంట హత్యల కేసులో.. నిందితులకు యావజ్జీవ శిక్ష

రంగారెడ్డి జిల్లా కోర్టులు, అక్టోబర్19 (నమస్తే తెలంగాణ): రియల్ ఎస్టేట్ వివాదంలో పట్టపగలు ఇద్దరు వ్యక్తులను సుపారీ గ్యాంగ్‌తో హత్య చేసిన నిందితులు మేరెడ్డి మట్టారెడ్డి అలియాస్ అశోక్‌రెడ్డి(43), మహ్మద్ ఖాజా మొయినుద్దీన్(34), బుర్రి భిక్షపతికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీమతి భవానీ చంద్ర తీర్పునిచ్చారు. అదనపు పీపీ రఘు కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం ఖల్సాలో ఏర్పాటు చేసిన లేక్ విల్లా ఆర్చిడ్ వెంచర్‌లో ప్రధాన నిందితుడు మట్టారెడ్డి నాలుగు ప్లాట్లు కొనుగోలు చేశాడు. ఇదిలా ఉండగా.. ఈ వెంచర్‌ను ఆనుకుని ఉన్న 14 ఎకరాల భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన మృతుడు శ్రీనివాస్‌రెడ్డి డెవలప్ చేస్తున్నాడు. ఈ క్రమంలో వీరిద్దరి మధ్య వివాదం తలెత్తింది. దీంతో శ్రీనివాస్‌రెడ్డిని చంపాలని కుట్ర పన్నిన నిందితుడు మట్టారెడ్డి.. మరో నిందితుడైన మహ్మద్ ఖాజా మొయినుద్దీన్, బుర్రి భిక్షపతిని రంగంలోకి దింపాడు. ఈ హత్య కోసం బీహార్‌కు వెళ్లి రివాల్వర్ కొనుగోలు చేశారు. 2022, మార్చి1న మాట్లాడుకుందామంటూ మట్టారెడ్డి ఫోన్ ద్వారా శ్రీనివాస్‌రెడ్డిని ఘటనా స్థలానికి పిలువగా.. అతడు తన మిత్రుడైన రాఘవేంద్రరెడ్డితో కలిసి వచ్చాడు. ఇరువురు మాట్లాడి.. తిరిగి వెళ్తుండగా మహ్మద్ ఖాజా మొయినుద్దీన్, బుర్రి భిక్షపతి వారిపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో శ్రీనివాస్‌రెడ్డి అక్కడికక్కడే మరణించగా.. రాఘవేంద్ర రెడ్డి చికిత్స పొందుతూ చనిపోయాడు. ఈ ఘటనపై శ్రీనివాస్‌రెడ్డి భార్య ధనలక్ష్మి ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాచకొండ పోలీసులు దర్యాప్తు నిర్వహించి, నిందితులను అరెస్టు చేశారు. ఆధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం.. ముగ్గురు నిందితులకు జీవితఖైదు, మొదటి ముద్దాయికి రూ.11 వందలు, మిగితా ఇద్దరికి రూ.800 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది.